సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టెలికామ్‌నగర్, ఆర్‌టీటీసీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

- ఎల్ అండ్ టీ సబ్‌స్టేషన్ పరిధిలో ..మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్ అండ్ టీ పార్కు స్ట్రీట్ నెంబర్ 22,23,24 ప్రాంతాలు, టెలికామ్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

తారానగర్ విద్యుత్ సబ్ స్టేషన్‌పరిధిలో..

తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాపూనగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు జి ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాపూనగర్, గోపినగర్, హనుమాన్ దేవాలయం ప్రాంతం, నెహ్రూనగర్, ఉర్దూ మీడియం ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఉమారాణి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నేతాజీనగర్, అపర్ణా అపార్ట్‌మెంట్స్, లేక్ వ్యూ పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్, ఫలక్‌నామాలకు వెళ్ళే ఎంఎంటిఎస్ రైళ్ల వేళలు ఇలా వున్నాయి.

- నాంపల్లి వైపు వెళ్లే ఎంఎంటీఎస్ రైళ్లు.. ఉదయం: 6:40,7:40, 8:10, 9:15, 10:15, 11:10, 11:55
- మధ్యాహ్నం: 12:50 , 13:20, 14:25, 15:20
- సాయంత్రం: 16:10, 17:55
- రాత్రి : 18:55, 20:05, 21:25
- సికింద్రాబాద్ వరకు : రాత్రి 22:50, 23:25
- ఫలక్‌నామా వైపు వెళ్లే ఎంఎంటీఎస్ రైళ్లు: ఉదయం: 5:50, 6:30, 6:50, 8:25, 9:05, 9:31, 10:05, 11:20,11:40.
- మధ్యాహ్నం: 12:40, 13:25, 14:40, 14:55, 15:10
- సాయంత్రం: 16:35, 17:10, 17:30, 18:00,18:35
- రాత్రి: 19:10, 19:55, 21:00, 21.15, 21:45.

బస్‌పాస్ కౌంటర్ పనివేళలు..

రాయదుర్గం: బస్‌పాస్ కౌంటర్ ప్రాంతం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో లింగంపల్లిలో బస్టాండులో రెండు బస్‌పాస్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయి.

- ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకు అన్ని పని దినాలలో అందుబాటులో ఉంటాయి.
- విద్యార్థులు, సాధారణ బస్‌పాసులు, రెనివల్స్ ఇస్తారు.

మార్చి 5వ తేదీన మల్లన్న జాతర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్నగర్ కాలనీలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో మార్చి 5వ తేదీ మల్లన్న జాతర నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయాన్ని ఆమె సందర్శించారు. ఆలయ నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ కురుమ సంఘం పెద్దలతో మాట్లాడి జాతర తేదీని ప్రకటించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కరికె యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఒగ్గు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

డా.అలీడా గువేరాను కలిసిన సీఆర్ ఫౌండేషన్ సభ్యులు



డాక్టర్ అలీడాగువేరాను సత్కరించిన సీఆర్ ఫౌండేషన్ సభ్యులు

హఫీజ్‌పేట్ : ప్రపంచ విప్లవకారుడు చేగువేరా కుమార్తె డాక్టర్ అలీడా గువేరా మనుమరాలు ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరా హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆదివారం ఆమెను సీఆర్ ఫౌండేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి ఫౌండేషన్ చేస్తున్న సేవలను వివరించారు. ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్‌పాషా, కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని తదితరులు ఉన్నారు.

కొవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఆరుగురికి కొవిడ్ టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

కాలు కదిపేదెలా?

వారాంతపు సంతలతో అన్నీ సమస్యలే..

- అసలే ట్రాఫిక్ జామ్
- ఆపై ..కూరగాయల వ్యర్థాల పారబోత అక్కడే..



సంత వల్ల రద్దీగా మారిన రోడ్లు, ఇబ్బందులుపడుతున్న వాహనదారులు

మియాపూర్: ప్రధాన, అంతర్గత రహదారులపై ఏర్పాటు చేస్తున్న కూరగాయల సంతలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల వద్దకే తాజా కూరగాయలు తీసుకొచ్చి అమ్ముతుండడంతో ఆదరణ బాగుంది. కానీ ఈ సంతలను ఖాళీ ప్రదేశాలు, మోడల్ మార్కెట్‌లలో లేదా స్ట్రీట్ వెండర్ దుకాణాలు అందుబాటులోకి తీసుకొచ్చి అక్కడ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లపై కూరగాయలు అమ్ముతుండడంతో ఆయా ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. సంతలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు కానీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ పడితే అక్కడ నిలిపి కూరగాయల కొనుగోలుకు వెళ్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది.

- మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో రోజు ఏదో ఒకచోట సంతలు జరుగుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్లు, స్ట్రీట్ వెండర్ దుకాణాల సముదాయాన్ని ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి తీసుకురాకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు చేస్తున్నారు. హుడా కాలనీ, మంజీరా రోడ్డు, చందానగర్‌లోని గోమతీనగర్ కాలనీ, పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు, దీప్తిశ్రీనగర్, జేపీనగర్, డీకే ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ,శ్రీదేవి థియేటర్ రోడ్లపై సంతల కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయి.

సమస్యలివే..

- రోడ్లపై కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంతో నడిచి వెళ్లేందుకు కూడా దారి ఉండడం లేదు.
- సమీపంలోని అపార్ట్‌మెంట్లు, ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మిగిలిన కూరగాయలు, ఇతర వ్యర్థాలను రోడ్డు పైనే పారబోస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా చెత్త, చెదారంతో నిండిపోతోంది. చెత్తను వెంటనే తొలగించకపోవడంతో కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది.
- ఈగలు, దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.





అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ల సమస్యల పరిష్కారానికి కృషి

బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్



మసీదుబండలో వాచ్‌మెన్లతో సమావేశమైన నాయకుడు రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్ల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం మసీదుబండలోని తన నివాసంలో నియోజకవర్గంలోని వివిధ అపార్ట్‌మెంట్ల వాచ్‌మెన్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవనోపాధి కోసం వలస వచ్చిన వారికి న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం కనీసం వాచ్‌మెన్లకు రేషన్‌కార్డులు, పెన్షన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కనీస సదుపాయాలలను కల్పించడంలో విఫలమైందన్నారు. వీరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



మియాపూర్ : చందానగర్ వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయంలో పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శాంతిహోమం, కుంకుమార్చన చేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం ఘనంగా జరిపించారు. ఉభయ దేవేరులకు స్వామి మూలవిరాట్‌కు బీజేపీ నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి పుష్పాలంకరణ చేయించారు.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని వీక్షించారు.



కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 15 వేల మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువత దేశానికి వెన్నుముక

కూకట్‌పల్లి: యువత దేశానికి వెన్నుముక అని, యువతను తప్పుదారి పట్టిస్తున్న అరాచక శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని, వాటిని నమ్మి చెడు తోవలో వెళ్లొద్దని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వెంకట్‌రావునగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం కూకట్‌పల్లి యువత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత ఆదర్శంగా నిలిచి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు యువతను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు అంతర్జాతీయ కంపెనీలు తీసుకువచ్చి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు కల్పించేందుకు బాటలు వేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా చైతన్య యాదవ్, సంతోష్, మహేష్, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సంతోష్, ప్రభాకర్‌లను అభినందించారు.

ప్రపంచానికి ఆదర్శప్రాయుడు మహాత్మా గాంధీ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): ఆదర్శప్రాయుడు మహాత్మా గాంధీ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహోన్నత నాయకుడు మహాత్మాగాంధీ అని కొనియాడారు. నేటి తరాలకు మహాత్మా గాంధీ చరిత్ర స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ కుమార్ గౌడ్, గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీలో చేరికలు

పటాన్‌చెరు టౌన్: ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ పటాన్‌చెరుకు విచ్చేస్తున్నారని అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం లక్ష్మణ్ సమక్షంలో పట్టణంలోని గోకుల్‌నగర్ వేదికగా బీజేపీలో యువకులు చేరనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పాజిటివ్ నిల్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఇద్దరికి కరోనా పరీక్షలు నిర్వహించగా జీరో పాజిటివ్ అని వైద్యులు అరవింద్ పేర్కొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

పటాన్‌చెరు టౌన్: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పట్టణంలోని శిశువిహార్ హైస్కూల్ కర్దనూర్ బ్రాంచ్ ఫెస్ట్ ఆదివారం నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అండ్ కరస్పాండెంట్ అనిల్, డైరెక్టర్ బీనాలు ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడూతూ నేటి సమాజంలో ఫోన్‌ల వాడకం విపరీతంగా పెరిగిందని, అపరిచిత వ్యక్తుల మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడం, ఓటీపీలు చెప్పడం వంటివి చేయొదన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

బాలుడికి అరుదైన శస్త్రచికిత్స

మాదాపూర్: బాలుడికి అరుదైన శస్త్రచికిత్స ద్వారా మూత్రకోశంలో రాళ్లను తొలగించినట్టు ఏఐఎన్‌యూ(ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ) వైద్యులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. యూరాలజిస్ట్ డాక్టర్ దీపక్ రాగూరి మాట్లాడుతూ కరీంనగర్‌కు చెందిన మూడేళ్ల బాలుడికి మూత్రకోశంలో 1.6 సెంటీమీటర్ల మేర రెండు రాళ్లు ఉన్నాయని ప్రత్యేకంగా పిల్లల కోసమే డిజైన్ చేసిన పరికరాలతో అత్యాధునిక థులియం ఫైబర్‌తో చికిత్స చేసినట్టు తెలిపారు. 45 నిమిషాల్లో శస్త్రచికిత్స చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ తైఫ్‌బెండిగెరి, పీడియాట్రిక్ డాక్టర్ ప్రభు కరుణాకరన్, డాక్టర్ లీల తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా నిలిపివేత

కూకట్‌పల్లి: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని పంపు మోటార్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో మంచినీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈఎం వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. 23న ఎల్లమ్మబండ పరిధిలోని మహంకాళినగర్, ఇంద్రా హిల్స్, ఎన్‌టీఆర్ నగర్, ఛత్రపతి శివాజీ నగర్, సిక్కుల బస్తీ, ఆశా నగర్, శ్రీనగర్ కాలనీ, 24న పీజేఆర్‌నగర్, మొగులమ్మ బస్తీ, రాజీవ్‌గాంధీ నగర్, దత్తాత్రేయకాలనీ, శివమ్మ కాలనీ, కమలమ్మ కాలనీ, జన్మభూమి కాలనీ, అంబేద్కర్‌నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్, మహవీర్ నగర్ ప్రాంతాల్లో అదే విధంగా భాగ్యనగర్ సెక్షన్ పరిధిలోని శ్రీరాంనగర్, కృష్ణవేణినగర్, సాయిచరణ్‌కాలనీ, సాయి ప్రశాంత్‌నగర్ కాలనీలో మంచినీటి సరఫరా ఉండదన్నారు.

సన్మానం



మాదాపూర్: కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఆర్యవైశ్య కమ్యూనిటీ అధ్యక్షుడిగా నియమితులైన బాలరాజు ఆదివారం ఎమ్మెల్యేను కలవగా ఆయన శాలువాతో సన్మానించారు. మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్ గుప్త, బాదం శర్వలింగం, బాలాజీ, శివరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ భగీరథ నీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



మిషన్ భగీరథను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ఇంటింటికీ భగీరథ నీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బీరంగూడ శ్రీ మల్లికార్జున హిల్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరాను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందించాలని సమున్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథను ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మస్జీద్ ఈ హర్కా సందర్శన



కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ బాపునగర్‌లోని మసీద్ ఈ హర్కను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ శ్రేయస్సు, అభివృద్ధి కోసం అందరం ఒక్కటనే భావన అందరిలోనూ ఉండాలన్నారు. అభివృద్ధి కోసం అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మస్జీద్ అధ్యక్షుడు మహ్మద్‌సలీమ్, ప్రధాన కార్యదర్శి యూసపుద్దీన్, మహ్మద్ అక్బర్, సర్వర్, తాహెర్, ముంతాజ్‌ఖాన్, ముంతాజ్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఎఫ్ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎల్‌ఎఫ్ నాయకులు

మియాపూర్: బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ 5వ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు వనం సుధాకర్ పిలుపునిచ్చారు. మియాపూర్‌లోని ఎంఏనగర్‌లో ఆవిర్భావ సభకు సంబంధించి కరపత్రాలను ఆదివారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బహుజనులకు రాజ్యాధికారాన్ని సాధించడమే బీఎల్‌ఎఫ్ లక్ష్యమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సామాజిక తెలంగాణ పేరుతో పాలకులు ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. 25న బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్, బిఏస్‌హాల్‌లో సభ జరుగుతుందని అధిక సంఖ్యలో ప్రజానీకం హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్, సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, బీఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు సుకన్య, నాయకులు పల్లె మురళి, దశరథ్ నాయక్, లావణ్య, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



క్యాన్సిలేషన్ కాపీని చూపుతున్న శ్రీకాంత్ గౌడ్ తదితరులు

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 521 లో ఉన్న మూడు ఎకరాల భూదాన్ భూమి కబ్జా చేసింది ఎవరో, వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని, అలాగే క్యాన్సిలేషన్ ఆర్డర్స్ వచ్చి రోజులు గడుస్తున్నా కబ్జాదారులు ఎవరో చెప్పకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం ముత్తంగిలో కబ్జాకు గురైన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నుంచి ఈ నెల 12వ తేదీన క్యాన్సలేషన్ కాపీ వచ్చిన సంగతి కూడా తెలియని స్థితిలో పటాన్‌చెరు తహసీల్దార్ ఉన్నారని ఆరోపించారు. కబ్జాలు, సమస్యలపై ఎవరైన ప్రశ్నిస్తే అధికార పార్టీ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కబ్జాదారులెవరో బహిర్గతం చేసి,చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు



పంచతత్వ పార్కును పరిశీలిస్తున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కార్పొరేటర్ చిట్ల దివాకర్‌లతో కలిసి 2వ డివిజన్ పరిధి అపురూప కాలనీ-2లోని పంచతత్వ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో జరుగుతున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లేస్పేస్, ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, కార్పొరేషన్ పరిధిలోని మిగతా ప్రాంతాల్లో సైతం పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్పొరేటర్ రాజేశ్వరి, నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ రాములు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సాంబశివరెడ్డి, మహేందర్‌రెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి దశరథ్, చందు, దివాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సహకార సంఘాలతో మేలు



ఎం.రమేశ్ కుమార్

పటాన్‌చెరు: సహకార సంఘాలతో సభ్యులకు మేలు కలుగుతుందని బీహెచ్‌ఈఎల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఉపాధ్యక్షుడు ఎం.రమేశ్ కుమార్ అన్నారు. సహకార సంస్థలతో అద్భుతాలు చేయవచ్చని పేద, మధ్యతరగతి ప్రజలకు సహకార సంస్థలతో మంచి లాభాలు ఉంటాయన్నారు. దశాబ్ద కాలానికి పైగా సొసైటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగిన రమేశ్ భెల్ యాజమాన్యం సహకార సామ్రాట్‌గా బిరుదును పొందాడు. భెల్‌లో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగిగా 39 ఏళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించిన రమేశ్ సేవలు సంతృప్తినిచ్చాయన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా సాక్షితో పలు విషయాలను పంచుకున్నారు. 2002-07లో సొసైటీ డైరెక్టర్‌గా పని చేసి, 2012 నుంచి 2023 వరకు ఉపాధ్యక్షుడిగా కొనసాగిన రమేశ్ సొసైటీ సభ్యులకు రూ.2లక్షల నుంచి రూ.12.60 లక్షల వరకు రుణ సదుపాయం, తక్కువ ధరకు సేఫ్ డిపాజిట్ లాకర్ సౌకర్యం, సభ్యుల పిల్లల ఉద్యోగాల కల్పనకు కోచింగ్ ప్రోగ్రామ్స్, మ్యాక్స్ హౌసింగ్ సొసైటీతో కార్మికుల సొంతింటి కల నెరవేర్చినట్లు పేర్కొన్నారు. రమేశ్ సేవలకు మెదక్ డీసీసీబీ నుంచి సన్మానం, కలెక్టర్ చేతుల మీదుగా రమేశ్ ఉత్తమ సేవా అవార్డు అందుకోవడంతో పాటు భెల్ యాజమాన్యం ఆయన పేరును ఎక్సెల్ అవార్డుకు ప్రతిపాదించింది. ఈ సందర్భంగా సర్వీస్ సమయంలో తనకు సహకరించిన సభ్యులకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం భెల్ టౌన్‌షిప్‌లోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో మధ్యాహ్నం ఆయన రిటైర్మెంట్ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏఎస్ రాజునగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నెఫ్రాలజీ వైద్యులు విజయ్ వర్మ, పల్మనాలజి వైద్యులు చేతన్ రావు, కార్డియో వైద్యులు డాక్టర్ భరత్ వి పురోహిత్, ఆర్థోపెడిక్ వైద్యులు కీర్తి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది పైగా రోగులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి కాలనీ అధ్యక్షుడు నర్సింహారావు, సెక్రటరి సతీష్‌రావు, కిషోర్, కంబారం రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది రాజిరెడ్డి, రాజ్‌కుమార్, నీరజ పాల్గొన్నారు.